

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని నోడల్ రిసోర్స్ సెంటర్, జెకెసి సంయుక్తంగా ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో హెటెరో డ్రగ్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, ఆర్‌అండ్‌డి, క్వాలిటీ కంట్రోల్, క్యూ ఏ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. బిఎస్‌సి, బికాం, పిజిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన 26 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు అర్హులని అన్నారు. నేరుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్‌లో నిర్వహించే మౌఖిక పరీక్షకు హాజరు కావాలన్నారు. హాజరయ్యే అభ్యర్థులు తమ ధ్రువపత్రాల జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. ఇతర వివరాల కోసం కో-ఆర్డినేటర్ మణికుమార్ 9949094968, 8919961110 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పకడ్బందీగా అట్రాసిటీ చట్టం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యేలతో కలిసి పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టం (పిసిఆర్ అండ్ పిఒఎ యాక్టు)పై జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కమిటీలోని ఎనిమిది మంది నూతన సభ్యుల నియామకానికి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అందులో నలుగురు ఎస్‌సి, ఒకరు ఎస్‌టి, ఇద్దరేసి చొప్పున బిసి, ఓసిలు ఉండేలా చూడాలన్నారు. రానున్న మూడు నెలల్లో నిర్వహించే ఈ సమావేశానికి నూతన కమిటీ ఉండాలని స్పష్టం చేశారు. ఎస్‌పి ఈ ఏడాది ఇప్పటి వరకూ నమోదైన అట్రాసిటీ కేసుల వివరాలను గురించి వెల్లడించారు. పలు కేసుల ప్రగతిని, ప్రస్తుత స్థితిని గురించి చెప్పారు. సమావేశంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల వైసిపి పాలనలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు, వెనుకబడిన తరగతులపై దాడులు, భూ కబ్జాలు, పెద్దఎత్తున సాగాయని, కొన్నిచోట్ల చట్టాన్ని తుంగలోకి తొక్కి కేసులు పెట్టిన సందర్భాలను చూశామని గుర్తుచేశారు. ఈ కేసులపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్దేశ పూర్వకంగా పెట్టిన కేసుల్లో వాస్తవాలను వెలికి తీసి చర్యలు తీసుకునే విధంగా చూడాలన్నారు. కొన్ని ఎస్‌సి, ఎస్‌టి కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇంతవరకు వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తన దృష్టికి వచ్చిన కొన్ని కేసుల విచారణ కూడా పూర్తి కాలేదని అన్నారు. అన్యాయం జరిగిన ప్రతి ఒక్క బాధితునికి న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, గొండు శంకర్‌లు మాట్లాడుతూ గడిచిన ప్రభుత్వంలో అట్రాసిటీ కేసులతో అన్యాయం జరిగిన కొందరు ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. భూ దందాల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని కోరారు. అలాగే అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సకాలంలో పరిహారం అందించాలని కోరారు. సమావేశంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, ఎఎస్‌పి శ్రీనివాసరావు, పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్, డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సోషల్ వెల్ఫేర్ డిడి విశ్వ మోహన్‌రెడ్డి, బిసి కార్పొరేషన్ ఇడి గెడ్డమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలి



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎపి బేవరేజ్ కార్పొరేషన్ హమాలీలకు ఎగుమతి కూలి రేటు రూ.9లకు పెంచాలని ఎపి బేవరేజ్ కార్పొరేషన్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.కొండలరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు స్థానిక ఐఎంఎల్ డిపోలో సిఐటియు ఆధ్వర్యాన మండల అధ్యఓఉలు టి.రామారావు అధ్యక్షతన శనివారం హమాలీలతో సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎపి బేవరేజ్ కార్పొరేషన్ హమాలీలకు ఎగుమతి కూలి రేటు 2023 నవంబరు నుంచి పెంచలేదని అన్నారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా నిత్యవసర వస్తువుల ధరలతో పాటు అన్ని ధరలు 200 శాతం పెరిగాయని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలీలకు ప్రస్తుతం చెల్లిస్తున్న ఎగుమతి కూలి రేటు రూ.7.35 పైసల నుంచి రూ.9కి పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు.

హమాలీలకు సమగ్ర చట్టం చేయాలన్నారు. హమాలీలకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫారాలను సరఫరా చేయాలన్నారు. పనిప్రదేశంలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలందరికీ ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలన్నారు. సమావేశంలో ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.బంగార్రాజు, బి.రాము, ఎన్.రమణ, జి.శ్రీనివాసరావు, పి.రామారావు, చిట్టప్పుడు, మోహనరావు, గోవింద పాల్గొన్నారు.

రణస్థలం: హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని, పెరిగిన ధరలకనుగుణంగా కూలి రేట్లు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, హమాలీల రాష్ట్ర ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సూరయ్య డిమాండ్ చేశారు. రణస్థలంలో హమాలీల, కళాసీలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కళాసీ కార్మిక సంఘం నాయకులు డి.మహాలక్ష్మి, ఎం.నర్సింహులు పాల్గొన్నారు.

సమస్యలను పక్కదారి పట్టించేందుకే...

● టిటిడి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించే ఆస్కారం లేదు ● మాజీ మంత్రి అప్పలరాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలోని సమస్యలను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంతి చంద్రబాబు నాయుడు టిటిడి లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం తెరమీదకు తెచ్చారని, లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించే ఆస్కారమే లేదని ఇఒ శ్యామలరావు అంగీకరించారని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వ్యాఖ్యానించారు. ఉల్లాసపేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైసిపి కార్యకర్తలతో శనివారం పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నాలుగు లారీలు కల్తీ నెయ్యి వచ్చిందని ఎలా తెలిసిందని సిఎం ప్రశ్నించారు. తిరుమలలో కల్తీ నెయ్యి పరీక్షలకు ప్రత్యేకమైన ల్యాబ్ ఉందన్నారు. దానివల్ల కల్తీలను పసిగట్టడం జరుగుతుందని, జగన్ హయాంలో 18 లారీలు, చంద్రబాబు హయాంలో 15 లారీలు ఈ పరీక్షలు వల్లే వెనక్కి పంపడం జరిగిందని, ఇది గొప్పగా చెప్పుకోవాల్సిన విషయమని అన్నారు. నెయ్యి కల్తీ సిఎం హోదాల ఉన్న వ్యక్తి వాఖ్యలు చేయడం మత, రాజకీయ సృష్టించడంతో సమస్యలు పక్కదారి పట్టాయని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ- సూపర్-సిక్స్ వంటి హామీలుపై ఎక్కడా మాట్లాడే పరిస్థితి లేదన్నారు. జూలైలో కల్తీ నెయ్యి వినియోగించారని సిఎం వాఖ్యలు చేశారని, ఎకవేళ కల్తీ నెయ్యి వినియోగిస్తే మీ ప్రభుత్వంలో, మీ ఇఒ ఆధ్వర్యాన ఈ సంఘటన జరిగిందని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారని, ముగ్గురు భార్యల విషయంలో ఎక్కడికి పోయిందని ఎద్దేవా చేశారు. ప్రతినెలా అప్పులు తెచ్చి జీతాలు, పింఛన్లు ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, పాలిన శ్రీనివాసరావు, డొక్కరి దానయ్య, బోర కృష్ణారావు, సనపల సింహాచలం, తామడ మదన్, మద్దిలి పాపారావు, సొర్రా తిరుపతిరావు పాల్గొన్నారు.

నేడు ఏచూరి సంస్మరణ సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కమ్యూనిస్టు ఉద్యమ రథసారధి సీతారాం ఏచూరి సంస్మరణ సభ ఆదివారం శ్రీకాకుళం నగరంలోని స్థానిక బాపూజీ కళామందిర్‌లో జరగనుంది. సభకు వామపక్ష నాయకులు, టిడిపి, వైసిపి, జనసేన, బిఎస్‌పి నాయకులు హాజరు కానున్నారు. ముఖ్య వక్తలుగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పేడాడ పరమేశ్వరరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, టిడిపి జిల్లా అధ్యక్షులు కలమట వెంకట రమణ, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు డి.రామప్పుడు పాల్గొనున్నారు. సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, చాపర వెంకటరమణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ, సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శులు తాండ్ర ప్రకాష్, తాండ్ర అరుణ, తామాడ సన్యాసిరావు, వంకల మాధవరావు తదితరులు పాల్గొనున్నారు. సభాధ్యక్షులుగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి వ్యవహరించనున్నారు. సభ సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానుంది.



మాట్లాడుతున్న ఆర్‌జెడి విజయ భాస్కర్

విద్యా బోధనలతో సంతృప్తిపర్చాలి

ఆర్‌జెడి విజయ భాస్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యా బోధనలతో సంతృప్తిపర్చాలని విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, జోన్-1 బి.విజయ భాస్కర్ స్పష్టం చేశారు. నగరంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళా వేదికలో ప్రధానోపాధ్యాయులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. శ్రీకాకుళంలో ఎచ్చెర్ల వీధిలోని పాఠశాలను సందర్శించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పాఠశాల తనిఖీలో విద్యపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తనిఖీలకు వచ్చే వారిని గౌరవ మర్యాదలతో కాకుండా విద్యా బోధనలపై సంతృప్తిపర్చాలన్నారు. భవిష్యత్‌లో ఆకస్మిక తనిఖీలు ఉంటాయని, ఉపాధ్యాయులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయ ఉద్యోగం చేస్తున్నప్పుడే ఓపికతో పనిచేయాలన్నారు. కష్టమని మానేయకుండా వృత్తిని ఆస్వాదించాలన్నారు. కష్ట, నష్టాలను ఎదుర్కొని సమస్యలను అధికమించాలన్నారు. పాఠశాలల్లో చురుకుగా ఉంటే ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. పనికిరాని వస్తువులు ఉంటే ఒక స్టోర్ రూమ్, ఒక పక్కన ఉంచుకోవాలన్నారు. స్కూళ్ల దగ్గర పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వారి రక్షణ కూడా ఉపాధ్యాయులుదే బాధ్యతన్నారు. పాఠశాలల్లోని విద్యార్థులను మన బిడ్డలుగా భావించాలని ఉద్బోధించారు. నాణ్యమైన విద్యను అందించి శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. డిఇఒ తిరుమల చైతన్య మాట్లాడుతూ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులపై జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయివేటు పాఠశాలలు కూడా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఉపాధ్యాయులు అటెండెన్స్, విద్యార్థులు అటెండెన్స్, సమయ పాలన పాటించాలని సూచించారు. విద్యా క్యాలెండర్, స్వర్ణాంధ్ర పోటీలు, స్వర్ణాంధ్ర సర్వే, స్వర్ణాంధ్ర సంగ్రహం తయారీ, పాఠశాల భద్రత, మధ్యాహ్న భోజనం, పాఠశాల ప్రొఫైల్స్, పని సర్దుబాటు, స్కూల్ కాంప్లెక్స్‌ల రీ ఆర్గనైజేషన్, పిఎంశ్రీ పాఠశాలు, పిఎం జన్మాన్ వసతిగృహాలు, ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు, నవోదయ ప్రవేశం, దసరా సెలవుల్లో విద్యార్థులను ఆకట్టుకోవడం వంటి అంశాలపై వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ అలీఖాన్ స్వర్ణాంధ్ర అంశాలపై వివరించారు. డిప్యూటీ డిఇఒ విజయ కుమారి, విలియమ్స్ పాఠశాలల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ డెరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఇ ఇఇ డి.వి.ఎన్.మూర్తి, ఎంఇఒలు, ఎస్ఎస్ఎ సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత వివేకానంద

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

స్వామి వివేకానందుడు మన దేశానికి మాత్రమే కాదు, యావత్ ప్రపంచ యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం మునసబుపేటలో ఉన్న గురజాడ గాయత్రి కళాశాలలో జిల్లా యువజనోత్సవాలను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని, యువశక్తిని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందుడు యువతరానికి రోల్ మోడల్ అని అన్నారు. తన మాటలతో యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. జనవరి 12న వివేకానందుని జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించడం అభినందనీమని తెలిపారు. జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో విద్యార్థులు బాగా రాణించి జాతీయస్థాయి యువజనోత్సవాలకు అర్హత సాధించి జిల్లా కీర్తిని చాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకత, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు.

మన సంస్కృతి, సంప్రదాయాలను చాటేందుకు ఈ యువజనోత్సవాలు ఉపయోగపడతాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, ఎన్.ఈశ్వరరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, డిఎస్‌డిఒ శ్రీధర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ పాల్గొన్నారు.



షీల్డ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

జాషువా సేవలు మరువలేనివి



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సాహితీ వేత్తలు

శ్రీకాకుళం అర్బన్ : గుర్రం జాషువా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారని తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు అన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో స్రవంతి ఆధ్వర్యాన మహాకవి, కవి కోకిల పద్మభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ వంటి అనేక అవార్డుల గ్రహీత గుర్రం జాషువా 129వ జయంతి సభ శనివారం నిర్వహించారు. ఈ సభకు సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి గరిమెల్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి, విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గబ్బిలం, క్రీస్తు చరిత్ర, నేతాజీ బాపూజీ, ఫిర్దౌసి, ముసాఫిర్లు వంటి అనేక ఖండకావ్యాల్ని తెలుగుజాతికి అందించారని పేర్కొన్నారు. జన్మత: వివక్షకు గురై ఆ వివక్ష మీదే పోరాడి మహోద్దండులైన పండితుల చేత సత్కారాల్ని గండపెండడరాలని గజారోహణాల్ని అందుకున్న గొప్ప కవి అని అన్నారు. కవయిత్రి తంగి ఎర్రమ్మ స్వీయ కవితా పఠనం చేశారు. కార్యక్రమంలో పి.సుధాకరరావు, నెట్టిమి రమణారావు అల్లాడ లక్ష్మి, డి రామకృష్ణ, పొందూరు అప్పారావు, డి.సుధామణి పాల్గొన్నారు.

యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలి

కోటబొమ్మాళి: అక్టోబరు 1 నుంచి 3 వరకు జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలకు హజరయ్యే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డిఒ సుందర్శన్‌దొర సూచించారు. కొత్తమ్మతల్లి ఆలయంలో అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాల్లో పారిశుధ్యపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. క్యూలైన్‌లో ఉన్న యాత్రికులకు తాగునీరు, చిన్నారులకు పాలు అందేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. జంగిడి పోటీల్లో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సిఐ కె.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి బి.రామారావు, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, ఎస్ఐ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కావ్య, ఆలయ ఇఒ రాధాకృష్ణ, టిడిపి నాయకులు బోయిన రమేష్, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కను నాటుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, అందువల్ల ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.చందు, బి.హరీష్‌లు పిలుపునిచ్చారు. భగత్ సింగ్, గాంధీ జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ నెల 25 నుంచి అక్టోబరు 2 వరకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శనివారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. సమాజంలో పర్యావరణ పరిరక్షణ మొక్కలు ఎంతో కీలకమన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు విద్యార్థులు నడంకట్టాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ స్వాతంత్ర సమరయోధుల జీవిత ఆశయాలు, విశేషాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు సిహెచ్.రాజు, దుర్గాప్రసాద్ సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, గర్ల్స్ కన్వీనర్ పవిత్ర, మోహిని, ప్రసాద్ పాల్గొన్నారు.

పాత కార్యక్రమాలకు కొత్త నామకరణాలు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదో ఒకటి హడావుడి చేయకుండా ఉంటే ప్రభుత్వం ఏదీ చేయడం లేదని ప్రజలను అనుకుంటారేమో కాబోలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పేర్లతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పాత కార్యక్రమాలకే కొత్త నామకరణాలు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హీ సేవా పేరుతో 15 రోజులు పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే... రాష్ట్ర ప్రభుత్వం మన ఇల్లు-మన గౌరవం పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ రెండు కార్యక్రమాలకూ పైసా పెట్టుబడి పెట్టకుండానే జనంలోకి వెళ్లే కార్యక్రమంగా రూపొందించుకున్నాయి. ఇందులో స్వచ్ఛతా హీ సేవా కారక్రమంలో భాగంగా మున్సిపాలిటీల్లోని పలు ప్రాంతాలు, పాఠశాలలు, దేవాలయాలను శుభ్రం చేస్తున్నారు. ఇందులో జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సైతం భాగస్వామ్యమవుతున్నారు. ఎప్పటి మాదిరిగానే దశాబ్ద కాలంగా వినిపిస్తున్న సుందర శ్రీకాకుళం మాట మరోసారి ధ్వనించింది. శ్రీకాకుళం నగరం సుందరంగా ఎప్పుడు మారుస్తారో తెలియదు కాని నగరంలో ఓ అరగంట పాటు వర్షం పడితే ఆ సుందరమేమిటో అందరికీ ఎరుకే. ప్రధాన రోడ్లపై ఒక అడుగు మేర మురుగు పొంగి పొర్లడం నగర పౌరులకు స్వీయ అనుభవమే. ఖరీదైన వాహనాల్లో వెళ్లే ప్రజాప్రతినిధులకు ఇది తెలియకపోవచ్చు గాని సామాన్య ప్రజలకు మాత్రం వర్షం పడిన ప్రతిసారీ ఇదే అనుభవం ఎదురవుతోంది. స్వచ్ఛతా హీ సేవలో ప్రజా ప్రతినిధులు, కొందరు అధికారులు చెత్త ఏరివేతలో ఒక రోజు పాల్గొని తాము స్వచ్ఛ శ్రీకాకుళంలో భాగస్వామ్యం అయ్యామని సంతోషపడొచ్చు. పారిశుధ్య నిర్వహణలో ఉన్న సమస్యలు, కార్మికుల ఇబ్బందులేమిటన్న అంశాలపై కొంత లోతుగా వెళ్లే అసలు విషయం అవగతమవుతుంది. శ్రీకాకుళం నగరం అంతకంతకూ విస్తరిస్తోంది. జనాభా పెరుగుతుండటంతో ఉత్పత్తి అవుతున్న చెత్త కూడా విపరీతంగా పెరుగుతోంది. రోజుకు 40 టన్నులు చెత్త ఉత్పత్తి అయినప్పుడు ఎంత మంది పనిచేస్తున్నారో... ఇప్పుడు రోజుకు 64 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నా అంతే మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. మున్సిపాలిటీల్లో ఏళ్ల తరబడి కొత్త ఉద్యోగాల భర్తీ లేకుండానే నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో 511 మంది కార్మికుల్లో శాశ్వత ప్రాతిపదికన 73 పనిచేస్తుండగా, 438 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కేవలం రూ.21 వేలు చెల్లిస్తూ ప్రభుత్వం వారితో బండ చాకిరీ చేయిస్తోంది. వారికి కావాల్సిన చీపుర్లు, కాలువ బల్లలు, కొంకీలు, బుట్ట తదితర పనిముట్లు కావాలని కార్మికులు మొరపెట్టుకుంటున్నా వినే నాథుడే కరవయ్యాడు. పెరుగుతున్న జనాభా కనుగుణంగా కార్మికులను నియమించి, వారికి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించడంతో పాటు వారికి అవసరమైన పనిముట్లు సరఫరా చేస్తే రోజూ నగరం పరిశుభ్రం కాదా? దీనిని విస్మరించి స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛ సంకల్పం వంటి పేర్లతో 15 రోజులు హడావుడి చేస్తే ఎప్పటికీ స్వచ్ఛ శ్రీకాకుళం నినాదంగానే ఉండిపోతుంది.

రాష్ట్ర ప్రభుత్వం మరో డబ్బులు ఖర్చు కాని కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'మన ఇల్లు-మన గౌరవం' టైటిల్‌తో కూటమి పార్టీ ప్రజాప్రతినిధులను ప్రజల్లోకి పంపేలా ప్రోగ్రామ్‌ను రూపొందించింది. జగనన్న కాలనీలను పరిశీలించి లబ్ధిదారులకు భరోసా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాప్రతినిధులను ఆదేశించడంతో 'మన ఇల్లు-మన గౌరవం పేరుతో అంతా కాలనీలను సందర్శించే పనిమొదలు పెట్టారు. గత ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న ఇళ్ల పేరునే మార్పు చేసి దానికే కొత్త పేరు తగిలించింది. ఇందులో ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు జగనన్న కాలనీలను సందర్శించి పరిశీలిస్తున్నారు. అక్కడ సమావేశంలో కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారు. పనిలో పనిగా గత వైసిపి ప్రభుత్వంపై విమర్శలు దాడి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లనే తాము ఇచ్చినట్లుగా గత ప్రభుత్వం బిల్డప్ ఇచ్చిందని దుమ్మెత్తిపోస్తున్నారు. గతంలో ఎన్‌టిఆర్ హౌసింగ్ పేరుతో నిర్మించిన గృహాలూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే అన్న విషయాన్ని కూటమి నేతలు మరిచినట్లు ఉన్నారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని, చాలా ఇళ్లు అసంపూర్తిగా ఉండిపోయాయంటూ లబ్ధిదారులపై ఎనలేని ప్రేమ కనబరుస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఏకరవు పెడుతున్న కూటమి ప్రజా ప్రతినిధులు తామేమి చేస్తామో చెప్పడం లేదు. కాలనీల్లో ఇళ్లు కట్టుకోలేకపోవడానికి, కట్టిన ఇళ్లను మధ్యలోనే ఆపేయడానికి కారణాలు తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.10 లక్షలు మాత్రమే ఇచ్చింది. ఇంటి నిర్మాణానికి ఐదారు లక్షల రూపాయాలు ఖర్చువుతుండటంతో డబ్బులు లేక చాలా మంది ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా నిర్మాణ వ్యయాన్ని పెంచితే లబ్ధిదారులు ముందురావొచ్చంటూ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వంటి నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలించలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిర్మాణ వ్యయం పెంచే దిశగా ఆలోచిస్తే తప్ప ఒట్టి మాటలు వారిని భరోసా కలిగించలేవు.

తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం జిల్లానూ తాకింది. ప్రధాన రాజకీయ పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు ఎవరికి వారే రకాల కార్యక్రమాలతో జిల్లాలోనూ ఆ చిచ్చును కొనసాగించే ప్రయత్నం చేశాయి. లడ్డూ వివాదంలో తమకే మైలేజి రావాలని తొలుత జనసేన నాయకులు మూడు రోజుల దీక్షకు తెర తీశారు. అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రజల్లో చర్చకు వచ్చేలా చూశారు. గత ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ధర్మాన ప్రసాదరావుగాని, అంతకుముందు ఎమ్మెల్యేగా చేసిన గుండ లక్ష్మీదేవిగాని నియోజకవర్గం పరిధిలో ఉన్న అరసవల్లి సూర్యనారాయణస్వామి లడ్డూ ప్రసాదాన్ని ఏనాడూ తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. లడ్డూ ప్రసాదం నాణ్యతగా లేదని సందర్శకుల నోటా ఏనాడు మాట రాలేదు. తిరుమల లడ్డూ వివాదం నేపథ్యంలో ఇక్కడా అటువంటిదేమైనా జరిగిందా? అన్న అనుమానాలకు తావిచ్చేలా ఎమ్మెల్యే గొండు శంకర్ వెళ్లి అక్కడి లడ్డూను పరిశీలించారు. చంద్రబాబు పాపాలకు ప్రక్షాళన పేరుతో వైసిపి నాయకులు జిల్లాలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల్లోనూ పూజలు చేసి వివాధాన్ని కొనసాగించే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో, జిల్లాలో మరే సమస్యలు లేనట్లు అధికార కూటమి పక్షాలు, వైసిపి దీక్షలు, పూజలతో ఆ వివాధాన్ని కొనసాగించి ప్రజల్లో గందరగోళం సృష్టించడం సరికాదు. లడ్డూ వివాదంపై ఇప్పటికే సిట్ విచారణ మొదలు పెట్టిన నేపథ్యంలో అంత వరకు అంతా మౌనం పాటిస్తే అందరికీ శ్రేయస్కరం.

వంద రోజుల్లోనే పాలన భేష్

ప్రజాశక్తి- మందస

టిడిపి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పింఛను పెంపు, భూ హక్కు చట్టం రద్దు, మెగా డిఎస్‌సిపై తొలి సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని బేతాళపురంలో శనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయుడు సుదూర ఉద్దేశంతో విజన్-2047 డాక్యుమెంట్లు సిద్ధం చేయనున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో పాల్గొని గర్భిణులకు, బాలింతలకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, రట్టి లింగరాజు, మాజీ ఎంపిపి దాసరి తాతారావు, ఎంపిటిసి సూరాడ మోహనరావు, లబ్బ రుద్రయ్య, ఎంపిడిఒ తిరుమలరావు, ఎపిఒ హరికృష్ణ పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న విసి రజని

సాంకేతిక పరిజ్ఞానం మరింత పెంచుకోవాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిశోధనాభివృద్ధి కేంద్రం, రోసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఇన్నోవేటివ్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్ (ఐసిడిటి)తో కలిసి వర్సిటీలో నిర్వహించిన ఐదు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణలో భాగంగా మూడురోజుల పాటు తరగతులు, రెండు రోజులు ల్యాబ్‌వర్క్ నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని పాల్గొని మాట్లాడుతూ ఈ తరహా శిక్షణలు పూర్తిచేసిన వారు టెలికాం, భవన నిర్మాణాలు, రక్షణ, వ్యవసాయం తదితర రంగాల్లో డ్రోన్ పైలెట్‌గా పనిచేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానం, కెరీర్‌ను మరింతగా మెరుగు పర్చుకునేందుకు వినియోగించు కోవాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసిన 87 మంది విద్యార్థుల్లో ప్రతిభ కనపర్చిన ఐదుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఆమె అంద జేశారు. ఐసిడిటికు చెందిన ఆపరేషనల్ హెడ్ పి.సాయినాథ్ మనోహర్, ఆర్అండ్‌డి హెడ్ పి.సాయిలత, మెకానికల్ ఇంజినీర్ వి.శివకుమార్, ఆర్అండ్‌డి ఇంజినీర్ కె.జ్యోతి, వి.పావనిలు ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్. రాజశేఖరరావు, ఆర్అండ్‌డి డీన్ డా.ఎస్. లోకేశ్వరి, అకడమిక్ అఫైర్స్ డీన్ డా.కె. స్వప్న వాహిని, సహాయ డీన్ డా. ఎన్. మధులత తదితరులు పాల్గొన్నారు.


మట్టితో గుంతలు కప్పిన రహదారి

ఎట్టకేలకు గుంతలు పూడ్చివేత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కొత్తకోట నుంచి బట్టుపాలెం, గురుగుబిల్లి మీదగా చీపురుపల్లి రోడ్డు వెళ్లే రహదారి ఇటీవల భారీ వర్షాలతో వరదకు రోడ్డు కోతకు గురై పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా ఉండటంతో ఈ నెల 24న 'అడుగడుగునా గుంతలే' పేరుతో ప్రజాశక్తిలో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ ఆదేశాలతో పిఆర్ డిఇఇ ఎం. మాధవి ఆర్ గురుగుబిల్లి రోడ్డును దగ్గరుండి ట్రాక్టర్లతో మట్టిని వేసి కొట్టుకుపోయిన రోడ్డు గోతులను పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో సుమారు 15 గ్రామాల ప్రజల రాకపోకలకు వీలు కల్పించడంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేసి ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిఇఇ మాధవిలత మాట్లాడుతూ పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.


దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

కదిలిన అధికారులు

కొత్తూరు: మండలంలోని కల్లెమ్మ రెవెన్యూ పరిధిలో భూ రీ సర్వేలో కొంత మంది రెవెన్యూ సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో భూముల తారుమారయ్యాయని, దీంతో ఈ-క్రాప్ నమోదు కాకపోవడంతో రైతులు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. దీంతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యాన రైతులు ఆందోళనలు, రాస్తారోకోలు నిర్వహించారు. దీనిపై తహశీల్దార్ బి.పాపారావు ఆదేశాల మేరకు రెవెన్యూ 30 మంది సచివాలయ సిబ్బంది గ్రామంలో బృందాలుగా రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఇందులో భాగంగా శనివారం నుంచి నాలుగు రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్ఎస్‌డిటి అనంతకుమార్ తెలిపారు.

దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాతపట్నం : స్థానిక నీలమణి దుర్గ అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం ఆవిష్కరించారు. అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజలందరూ తిలకించి, విజయవంతం చేసి అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని ఎమ్మెల్యే అన్నారు. ఆయనతోపాటు టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, సైలాడ సతీష్, ఆలయ ఇఒ టి.వాసుదేవరావు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ఇచ్ఛాపురం: ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని మంచి ఫలితాలు సాధించాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్. తవిటి నాయుడు సూచించారు. ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఫలితాలు సాధించా లన్నారు. ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని తెలిపారు. స్వర్ణాంధ్ర-47లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శంకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న తవిటినాయుడు

గృహ నిర్మాణాలు వేగవంతం


రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రజాశక్తి- పొందూరు

పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేసిన ప్రతి లబ్ధిదారునికి డబ్బులు ఇచ్చే బాధ్యత తానే తీసుకుంటానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పట్టణంలో మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు, లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వ్యవస్థలను విధ్వంసం చేశారని, అందులో గృహ నిర్మాణశాఖ ఒకటన్నారు. గత ప్రభుత్వంలో పేదలకు దూరంగా ఉన్న కొండ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి లే అవుట్లు వేశారని, అక్కడ రోడ్లు, కాలువలు, విద్యుత్‌తో పాటు తాగునీరు వంటి మౌలిక వసతులను కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రాలేదన్నారు. టిడిపి హయాంలో 2016-19 మధ్య ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు చెల్లించాల్సిన రూ.3,800కోట్లు జగన్‌మోహన్‌రెడ్డి చెల్లించలేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో తమకు పట్టాలు ఇచ్చారుగాని స్థలం చూపలేదని, పట్టా ఇచ్చారగాని ఇళ్లు మంజూరు చేయలేదని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో విఆర్‌ఒ, సర్వేయర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు కలిసి ఒక కమిటీగా ఏర్పడి దీనిపై పూర్తిస్థాయిలో వారం రోజుల్లో తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. లేఅవుట్‌లో తమకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఫిర్యాదు చేయగా ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చైతన్యకు తాగునీరు అందించాలని సూచించారు. 2014-19 టిడిపి హయంలో, 2019-24 వైసిపి ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను మార్చి 15లోగా పూర్తిచేసిన ప్రతి లబ్ధిదారునికి డబ్బులు చెల్లిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.నగేష్, తహశీల్దార్ రమేష్‌కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఇఒ మోహన్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, టిడిపి నాయకులు అనకాపల్లి శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, బాడాన శేషగిరి, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకర భాస్కరరావు, మండలస్థాయి అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని రణస్థలం పంచాయతీ పరిధిలో మన ఇల్లు - మన గౌరవం లబ్ధిదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, హౌసింగ్ ఎఇ మోహనరావు, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, కూటమి నాయకులు లెంక శ్యాం, పిసిని జగన్నాధం నాయుడు, పైడి అప్పుడుదొర, ముక్కు ఆదినారాయణ, నారాయశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూర్జ: ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో లబ్ధిదారులు తమ గృహాలు పూర్తి చేసుకోవాలని ఎంపిడిఒ పి.తిరుపతిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, హౌసింగ్ ఎఇ పి.లక్ష్మీనారాయణ, కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రాంప్రసాద్, గృహ లబ్ధిదారులు, మార్కెట్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ విశ్వప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు సీతారాం బాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని గరిమెళ్ల కొత్తవలసలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఉద్యానవనశాఖాధికారి ఆర్.వి.వి.ప్రసాద్, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, ఇఒపిఆర్‌డి డి. గోవిందరావు, హౌసింగ్ ఎఇ ధర్మేంద్ర, టిడిపి నాయకులు కోరుకొండ వెంకటరమణ, కార్యదర్శి, వర్క్ ఇన్స్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని పంచాయతీ ఎన్‌టిఆర్ కాలనీలో శనివారం నిర్వహించిన మన ఇల్లు - మన గౌరవంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి గృహాలు నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామని హామీనిచ్చారు. తాను సొంత గ్రామం సిదిలో ఉంటన్న ఇల్లు కూడా అప్పట్లో వచ్చిన కాలనీ ఇల్లే అని తెలియజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, హౌసింగ్ డిఇ వై. నర్సింహరావు, ఎఇ సీతారామరాజు, టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, సతీష్, సర్పంచ్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టి, వసుంధర, పెద్దపద్మాపురం, చాపర గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల్లోని ఇళ్లను పలాస వ్యవసాయ శాఖ ఎడి, మండల స్పెషల్ ఆఫీసర్ లింగాల మధుబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, మండల టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి తహశీల్దార్ ఎన్.హనుమంతరావు, ఎంపిడిఒ పడాల చంద్రకుమారి, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.


పొందూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

నందిగాం : మండలంలోని నందిగాంలో 17 పంచాయతీలకు సంబంధించి మన ఇల్లు...మన గౌరవం కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాసరావు నిర్వహించారు. కార్యక్రమంలో డిటి భాగ్యలక్ష్మి, ఎఒ శ్రీకాంత్ వర్మ, ఎపిఒ నాగరాజు, హౌసింగ్ ఎఇ దినేష్ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని టెక్కలిపట్నం పంచాయతీల్లో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు పంచాయతీ ప్రత్యేకాధికారి పోతనపల్లి చంద్రవేఖర్, ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయకుడు అవగాహన కల్పించారు. సమావేశంలో సర్పంచ్ ప్రతినిధి పి.కృష్ణారావు, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

టిటిడిపై చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు


ఆమదాలవలస : మాట్లాడుతున్న మాజీ స్పీకర్ సీతారాం

శ్రీకాకుళం అర్బన్: రాజకీయ అవసరాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానాన్ని చంద్రబాబు వాడుకుంటున్నాడని, అందులో భాగంగానే వైసిపిపైన, జగన్మోహన్ రెడ్డిపైన బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. శనివారం నగరంలోని పిఎన్ కాలనీలో నారాయణ తిరుమల ఆలయంలో వైసిపి ఆధ్వర్యాన ప్రత్యేక సేవలు నిర్వహించి చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు వైసిపి, జగన్మోహనరెడ్డిపై అక్కసుతో ఉద్దేశ్య పూర్వకంగా నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మతం పేరున ఓట్లు దండుకునే బుద్ధి చంద్రబాబుకే ఉందని విమర్శించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మామిడి శ్రీకాంత్, శిమ్మ రాజశేఖర్, అందవరపు సూరిబాబు, గొండు కృష్ణమూర్తి, రఘురాం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు కల్తీపై చేసిన ఆరోపణలను సిఎం చంద్రబాబు నాయుడు నిజాలతో నిరూపించాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సిఎం చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా వైసిపి పిలుపుమేరకు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం వెంకటేశ్వర స్వామి ప్రసాదం ఆట వస్తువుగా వాడుకోవటం తగదన్నారు. రాజకీయ మనుగడ కోసం ఎటువంటి చర్యలకైనా వెనుకాడని నైజం చంద్రబాబు రాజకీయ జీవిత చరిత్రలోనే ఉందన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రజలు చీదరించుకుంటుంటే ప్రజల దృష్టిని మరల్చేందుకు నీచమైన ఆరోపణలను సిఎం చేస్తున్నారని మండిపడ్డారు. కోట్లాదిమంది భక్తులకు బహిరంగ క్షమాపణలు చంద్రబాబు చెప్పాలని తమ్మినేని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చింతాడ రవికుమార్, కోట గోవిందరావు, బొడ్డేపల్లి రమేష్ కుమార్, నారాయణరావు, అల్లంశెట్టి ఉమా మహేశ్వరరావు, దుంపల శ్యామలరావు, ఎన్ని చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి పిలుపుమేరకు మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైస్ ఎంపిపిలు, మండల అధ్యక్షులు, జెసిఎస్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండలం కోటిపల్లిలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైసిపి నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి నాయకులు కొంచాడ రమణమూర్తి, కిల్లాన సూర్యారావు, సునీల్‌కుమార్, రమణ, వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక వెంకటేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి 108 కొబ్బరికాయలను కొట్టారు. జెడ్‌పిటిసి కె. భాగ్యలక్ష్మి, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఎస్.అశోక్ కుమార్, వైసిపి నాయకులు తోట నందకుమార్, కిరణ్ కుమార్, వరప్రసాదరావు నాయుడు, చింతాడ సూర్య నారాయణ, జి.ఆనందరావు, ఎ.నాగేశ్వరరావు, ఎ.రంజిత్‌కుమార్, వై.గోవిందరావు, రామారావు నాయుడు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

పాతపట్నం : స్థానిక నీలమణి దుర్గ, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి దొం`సావిత్రమ్మ, కోదూర సర్పంచ్ టి.మోహనరావు, వైసిపి నాయకులు ఏనుగుతల సూర్యం, ఎరుకోలు వెంకటరమణ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక వెంకటేశ్వర ఆలయంలో వైసిపి నాయకులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ భారతీ దివ్య, ఎంపిపి బోర పుష్ప, పట్టణ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు పట్నాయక్, మండల అధ్యక్షులు పి.రాజశేఖరరెడ్డి, నర్తు శివాజీ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక వెంకటేశ్వర ఆలయంలో వైసిపి నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, ఎపిపిలు నడుపూరి శ్రీరామ్మూర్తి, రోణంకి ఉమామహేశ్వరరావు, రాహుల్, జెడ్‌పిటిసిలు దుబ్బ వెంకటరావు, పాల వసంతరెడ్డి, ఎ.రామారావు, యర్ర చక్రవర్తి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూజలు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, ఉప కన్వీనర్ కరణం శశిభూషణరావు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, ఎంపిటిసి ప్రతినిధి ఉర్లాన రుషి, జయమునిరావు, లింగాల సంజీవరావు, శ్యామల జన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న సింహాచలం మహంతిని అరెస్టు చేసినట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పోలసరకు చెందిన సింహాచలం మహంతి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. అందులో సరైన ఆదాయం లేకపోవడంతో తప్పుడు దారిలో ఎక్కువ సంపాదించాలని ఆశతో గంజయి వ్యాపారాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా బడగోలుకు చెందిన ప్రమోద్ అనే వ్యక్తి నుంచి రూ.5 వేలు గంజాయిని కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో ఉంటున్న ఖలియ అనే వ్యక్తికి రూ.పది వేలుకు అమ్మేందుకు సిద్ధమయ్యాడని తెలిపారు. ఈ నెల 27 న బరంపురం నుంచి ఇచ్ఛాపురం వచ్చి రైలులో వెళ్తున్న సమయంలో సాయంత్రం 4 గంటలకు పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డు అన్న క్యాంటీన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించామని అన్నారు. తనిఖీలో ఆయన వద్ద నుంచి 8.160 కేజీలు గంజాయిని పట్టుకొని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా అమ్మకాలపై గట్టి నిఘా పెట్టినట్లు తెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బూర్జ : గాయపడిన క్షతగాత్రులు

ఇద్దరికి గాయాలు

బూర్జ : మండలంలోని డొంకలపర్త సమీపంలో ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వీరు విశాఖపట్నం నుంచి వీరఘట్టంలో ఒక కార్యక్రమానికి వెళ్తుండగా డొంకల పర్త జంక్షన్ వద్ద గోతుల్లో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షత గాత్రులను స్థానికులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

టెక్కలి రూరల్ : మండలంలోని అక్కవరం సమీపంలో శనివారం జాతీయ రహదారిపై ఆటో వెనుక బాగాన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గువ్వాడ రాజేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షత గాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, సెల్‌ఫోన్లు చోరీ

కొత్తూరు : మండలంలోని పారాపురానికి చెందిన దార్ రాజుకు చెందిన బైక్, అదే గ్రామానికి యందవ రవికుమార్ కుటుంబానికి చెందిన ఐదు సెల్‌ఫోన్లు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయని ఎస్ఐ ఎం.అహ్మద్ శనివారం తెలిపారు. ఆరుబయట ఉన్న బైక్, ఇంట్లో ఉన్న సెల్‌ఫోన్లను దొంగలు దొంగించారని బాధితులు ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి : టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు పరిధిలోని న్యాయ సేవా విభాగం ఆధ్వర్యాన నిర్వహించనున్న పారాలీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులను కోరుతున్నామని జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి, మండలాల పరిధిలోని వారు అర్హులని అన్నారు. అక్టోబరు 5వ తేదీలోగా దరఖాస్తులను కోర్టులో అందించాలన్నారు. ఎటువంటి పారితోషకం ఉండదని, స్వచ్ఛందంగా సేవలు అందించాలని అన్నారు. ఆసక్తి గల దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు సదస్సు

టెక్కలి : ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై సిపిఐఎంఎల్ న్యూడెమెక్రసీ ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆదివారం సదస్సు నిర్వహించనున్నామని నిర్వాహకులు వంకల మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి మేధావులు హాజరు కావాలన్నారు.

నేడు రామలక్ష్మి వర్ధంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి కీర్తిశేషులు కొత్తకోట రామలక్ష్మి ఆరో వర్ధంతి ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నేనొక కవితా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్ కుమార్ హాజరు కానున్నట్టు తెలిపారు. పుస్తక ఆవిష్కర్తగా ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు వ్యవహరిస్తారని, ఇతర సాహితీ వేత్తలు హాజరు కావాలని కోరారు.

రేపు ఆధార్ ప్రత్యేక డ్రైవ్

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రధాన పోస్టల్ కార్యాలయంలో ఈ నెల 30నఉదయం 8 గంటల నుంచి ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు టెక్కలి హెడ్ పోస్టుమాస్టర్ ఎన్.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఆధార్ కార్డులో ఆర్పులకు, చేర్పులకు అవకాశం ఉంటుందన్నారు. టెక్కలి, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరసవల్లి ఇఒగా భద్రాజీ


భద్రాజీ

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణా ధికారిగా డిప్యూటీ కమిషనర్ వై. భద్రాజీ నియమితు లయ్యారు. శనివారం సాయంత్రం ఆయన అరసవల్లిలో బాధ్యతలు చేప ట్టారు. ఆయనకు ఆలయ సాంప్రదాయం ప్రకారం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనను జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ బి.ఆర్.వి.వి. ప్రసాద్ పట్నాయక్, వెంకటేశ్వర స్వామి దేవాలయం కార్య నిర్వహణాధికారి శ్యామలరావు, శ్రీకూర్మనాథ స్వామి ఆలయ కార్య నిర్వహణాధికారి జి.గురునాథరావులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

మెరుగైన సేవలు అందిద్దాం

కోటబొమ్మాళి: మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిద్దామని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మండల పరిషత్‌కు బదిలీపై వచ్చిన కార్యాలయ సూపరింటెండెంట్ డి.మంగరాణి, సీనియర్ సహాయకులు బి.పార్వతీశం, జూనియర్ సహాయకులు వై.వి.రామారావు, కంప్యూటర్ ఆపరేటర్ జె.వెంకటరావులను శనివారం స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బి.రామారావు పాల్గొన్నారు.

మాతా శిశు ఆరోగ్య సంరక్షణే లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాతా, శిశు సంపూర్ణ ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఫాజుల్‌బాగ్‌పేటలో ఉన్న ఐసిడిఎస్ అర్బన్ ప్రాజక్టు కార్యాలయంలో శనివారం నిర్వహించిన పోషణ అభిమాన్ మాసోత్సవాల్లో ఆయన హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ మాసాంతం వరకు పోషక అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి పరిణామమన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులపై అధికారులు, ఐసిడిఎస్ సిబ్బంది ప్రచారం నిర్వహించాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో పోషకాహారంపై అవగాహన, చిన్నారులకు అన్నప్రాసన, సీమంతాలు, అక్షరాభ్యాసం, గర్భిణుల నమోదుతో పాటు పరీక్షలు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో కార్యక్రమం లక్ష్యాన్ని వివరించాలన్నారు. ఐసిడిఎస్ అర్బన్ ప్రాజక్టు పిఒ శోబారాణి మాట్లాడుతూ పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవడం వలన రక్తహీనత, ఇతర సమస్యలు రాకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: దేశంలో కీలకమైన సెక్టార్ అంగన్వాడీ కేంద్రాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పోషణ మహా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడీల్లో కార్యకర్తలు తల్లి తర్వాత తల్లి స్థానంలో ఉండి సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ చేస్తూ ఆరోగ్యకరమైన బిడ్డలని ప్రసవించేలా తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. అనంతరం ఆహార ప్రదర్శనలో ఆహార పదార్థాలు రుచి చూశారు. అలాగే గర్భిణులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, ఎంపిడిఒ రామారావు, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, సిడిపిఒ నాగారాణి, సూపర్‌వైజర్లు సుజాత, నీలవేణి, అంగన్వాడీ కార్యకర్తలు హైమా, జయ, జయలక్ష్మి, ఉమా పాల్గొన్నారు.

హమ్మయ్య.. పైపులు వేశారు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద అలికాం - బత్తిలి ప్రధాన రహదారిపై గడిచిన మూడేళ్లుగా కుంగిపోయిన కల్వర్టుకు శనివారం రోడ్లు భవనాల శాఖ అధికారులు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించడంతో వాహనదారులు, మండల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న కల్వర్టు కుంగిపోయి ఇటీవల ప్రధాన రహదారిలో భారీ గుంతలు ఏర్పడి ప్రతిరోజు వాహనాలు గుంతలలో దిగబడిపోతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సమస్యను వివరించి తక్షణమే కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేసి యధాస్థితిగా ప్రధాన రహదారిపై రాకపోకలకు చర్యలు చేపట్టాలని ఆదేశించడంతో శనివారం సాయంత్రం కల్వర్టు పైపులు వేసి, వెట్‌మిక్స్ ద్వారా కల్వర్టు ప్రాంతంతో పాటు ఆ ప్రాంతంలో ఉన్న గుంతలను పూడ్చివేశారు. దీంతో వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగుతున్నాయి.

లోవోల్టేజీ సమస్యపై ఆందోళన

పొందూరు: గ్రామంలో లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఎన్నో ఏళ్లుగా స్థానిక విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదంటూ మండలం నందివాడ గ్రామస్తులు శనివారం శ్రీకాకళంలోని విద్యుత్‌శాఖ ఎడి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. లోవోల్టేజీ కారణంగా గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోవడంతో రెండు రోజులుగా చీకటిలోనే గడపాల్సి వచ్చిందంటూ గ్రామస్తులు ఆవేదనను వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యతో విసిగిపోయిన గ్రామస్తులు స్థానిక లైన్‌మేన్ సహాయంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లును తొలగించి వాటిని పట్టుకుని శ్రీకాకుళం ఎడిఎ కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేశారు. దీంతో ఎడిఎ యు.వి.రమణమూర్తి గ్రామస్తులకు నచ్చచెప్పి 11కెవి, 15 కెవి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశారు. గ్రామస్తులు తమ సొంత ఖర్చులతో వాటిని గ్రామంలోకి తీసుకువచ్చి పాత ట్రాన్స్‌ఫార్మర్లు స్థానంలో ఏర్పాటు చేశారు. గతంలో ఇదే లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో లోవోల్టేజీ సమస్య ఉండేదని, ఇప్పుడు కూడా ఇవే లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి అధిక లోడ్ ఉండే ట్రాన్స్‌ఫార్మర్లు అధికారులు ఏర్పాటు చేయాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎడిఎ రమణమూర్తి


పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు

బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి- పోలాకి

గార- వనితమండలం బ్రిడ్జిని గత టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.72 కోట్లతో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించి 70 శాతం శాతం పనులు పూర్తి చేసిందని నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు నిలిచిన బ్రిడ్జిని శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఒక్క శాతం పని కూడా చేయకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వదిలేశారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాలశాఖ, రెవెన్యూ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ సురేఖ

సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని 80 అడుగుల రోడ్డులో సన్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన నిర్వహించిన గ్రాప్య 2024 మేనేజ్‌మెంట్ పెస్ట్‌లో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విద్యార్థులు సత్తా చాటారు. వక్తృత్వ పోటీలో కె.గాయత్రి, లక్ష్మి, బిజినెస్ పీర్చింగ్‌లో వి.రాజశేఖర్ ప్రథమ స్థానంలో నిలిచారు. బిజినెస్ గేమ్‌లో టి.భార్గవి, ఒ.తేజ, బి.జయరాం, సిహెచ్.తరుణి, బి.పవన్, యు.హిమబిందు, బిజినెస్ క్విజ్‌లో పి.సత్యసాయి ప్రకాష్ అండ్ టీం ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఆర్.హరిత, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్. ఎ.సూరిబాబు అభినందించారు.


హాజరును పరిశీలిస్తున్న జడ్జి రోహిని

మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాతపట్నం జూనియర్ జడ్జి రోషిణి

ప్రజాశక్తి- సారవకోట

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి ఆదేశించారు. మండల పరిధిలోని బొంతు, తర్లి, సారవకోట బాలుర ఆశ్రమ పాఠశాలలు, కెజిబివిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న భోజనం సదుపాయం బాగుండాలన్నారు. నిద్రించే గదులు, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. తరగతి గదులు, డార్మెంటరీ, కుకింగ్ చేసేవారు అందరూ సరిపడా ఉన్నారా? లేదా? ఎవరైనా అవసరం అయితే తెలియపరచాలని సిబ్బందిని సూచించారు. కొన్ని వసతిగృహాలకు వ్యాచ్‌మెన్ లేరని, వర్షం పడితే కొన్ని గదులు కారుతున్నాయని వార్డెన్లు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో వాటిని సమన్వయం చేస్తామని జడ్జి తెలిపారు. అనంతరం హాజరుపట్టీని పరిశీలించారు.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి- పాతపట్నం

ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఇప్పటినుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ అన్నారు. మండలంలోని ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని, ఎటువంటి ఒత్తిడి లేకుండా చూడాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు వండుతున్న భోజనాన్ని, తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, కొల్లివలస ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి: టిడిపి, జనసేనలకు చెందిన ఎమ్మెల్యేలు కానుమూరి రఘురామకృష్ణంరాజు, పంతం నానాజీలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బోకర నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులపై, దళితులపై ఆసభ్యకరంగా వ్యవహరించిన తీరుని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉండి కూడా బాధ్యతారాహిత్యంగా దళితులపై విరుచుకుపడడం సరికాదన్నారు. ఇటువంటి నాయకుల వల్ల ప్రజాస్వామ్యం ఆపహాస్యమవుతుందన్నారు.

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- టెక్కలి

నిబిడీకృతమైన మెలకువలను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అభినందించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో విజేతలు ఆర్.రష్మిక, కె.జాహ్నవిలను శనివారం అభినందించారు. ప్రభుత్వం స్వచ్ఛందంగా నిర్వహించే ఈ వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారిని ప్రోత్సాహించేందుకు ఈ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ధర్మారావు, ధనుంజయరెడ్డిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

చెత్త సేకరణపై దృష్టి

పలాస: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు చెత్త సేకరణ సక్రమంగా చేపట్టాలని పలాస డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ అన్నారు. మండలంలోని బొడ్డపాడులో శనివారం పర్యటి చెత్తా సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎక్కడ చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, సర్పంచ్ తామడ మదన్, కార్యదర్శి మీనా కుమారి పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న రమణ

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వాతంత్ర పోరాటంలో అగ్గి బావుటాల బ్రిటిష్ సైన్యాలను ఎదురొడ్డిన వీరుడు భగత్ సింగ్ అని వక్తలు పేర్కొన్నారు. గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులు సంఘం సంస్మరణ స్మృతి వనంలో స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ జయంతి శనివారం నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి దాతలు నేమాని వేదవతి, దేవి శ్యాం ప్రసాద్ కుటుంబంతో పాటు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు, ప్రముఖులు డాక్టర్ జామి భీమశంకర్, సురంగి మోహనరావు, పైడి హరినాథరావు, నిష్టల నరసింహమూర్తి, కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్, ఎంఎస్ఎన్ గుప్తా, గుత్తు చిన్నారావు బృందం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర పోరాటంలో భగత్ సింగ్ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అనంతరం పండితులు పైడి హరినాథరావు, నిష్టల నరసింహమూర్తి బృందం భగత్ సింగ్ గొప్పతనాన్ని కీర్తిస్తూ గేయాలు ఆలపించారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు ను గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్, మెట్ట అనంత భట్లు, శాస్త్రీ, సువ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో స్వతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాస రావు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో చరిష్మా ప్రథమ, హేమంత్‌కు ద్వితీయ బహుమతి లభించింది. గ్రంథాలయం తరుపున బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నీలిమ, ప్రిన్సిపాల్ టి.బాలరాజు, గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న నిర్వాహకులు

పొందూరు: పట్టణంలో యంగ్‌స్టార్ యూత్ క్లబ్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి-2 అనకాపల్లి వాణి, ఆట్ల చంద్రశేఖర్, కుమిలి రాజేష్, కోరాడ రాజు, బాడాన మరళీమోహన్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాతపట్నం : పాతపట్నం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పొడ్డిడి కృష్ణారావు అధ్యక్షతన స్థానిక రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పాలకొల్లి రామరాజు ఆధ్వర్యాన భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రాజేశ్వరి, ఎ.దాలయ్య, జె.గాయత్రి, ఎం.రమణ, బి.ఈశ్వరమ్మ, హెచ్.శ్యామల పాల్గొన్నారు.

నరసన్నపేట : అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యాన స్థానిక బిసి హాస్టల్ వద్ద భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి నెయ్యల సాంబశివరాజు, చిన్నబాబు, వసంత్, కార్తీక్, వినయ్, దినేష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని జలకలింగపురంలో భగత్ సింగ్ చిత్రపటానికి జనసేన నాయకులు దక్ష బాలరాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నక్క వెంకటరావు, సోనాపురం మహేష్, దుక్క ధనుంజయ, రేవతి పతి, హరికృష్ణ పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అన్నెన్న మధుబాబు, ఎబివిపి జిల్లా అధ్యక్షుడు గోరు వాసుదేవరావు, గోరు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిప్రదాత భగత్ సింగ్ అని జన విజ్ఞాన వేదిక యువజన జిల్లా కన్వీనర్ బాడాన రాజు అన్నారు. బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు తాడేల లోకేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు, డి.ఉమాదేవి, కె.రమణమ్మ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

నందిగాం : మండలంలోని తామరాపల్లి ప్రాథమిక పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు బి.శంకరరావు, వి.కుమారిలు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

నౌపడ : నౌపడ శాఖగ్రంథాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.రూపావతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వికలాంగ సంఘం నాయకులు కొరికాన పవిత్రుడు, బివి.సురేష్, సచివాలయం సిబ్బంది హరిత, భీమారెడ్డి, గ్రంథాలయ సహాయకుడు ప్రసాద్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలో భగత్ సింగ్ చిత్రపటానికి చైర్మన్ చాట్ల తులసీ దాసు రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి : ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భాగంగా విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు పరిశ్రమని రక్షించుకోవాలని ప్రజా పోరాటాలు జరగాలని, వీటికి భగత్‌సింగ్ పోరాటాలు ఆదర్శంగా తీసుకోవాలని ఎబివివిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌సి బాలుర వసతిగృహంలో శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రేమ్‌చంద్, భరత్, సాయి, మణికంఠ పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ బాలాజీ

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిపుల్ ఐటి విద్యార్థులు శివసాయి, రామారావు ఈ నెల 27న శ్రీకాకుళంలో జరిగిన 400 మీటర్ల రన్నింగ్‌లో రెడ్డి శివ సాయి ద్వితీయ స్థానం, రామారావు షార్ట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ అభినందించారు. క్రీడల్లో రాణించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం రాజు, దిలీప్ కుమార్, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, సాగర్, మోహనరావు, గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

శతశాతం పింఛన్లు అందజేయాలి

ప్రజాశక్తి- బూర్జ

ఈ నెల 1న శతశాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని ఎంపిడిఒ తిరుపతిరావు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో సిబ్బంది పింఛన్లను పంపిణీ పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అలాగే 2వ తేదీన గ్రామ సభలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, ఎపిఒ రాజ్ కుమార్, కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ చిన్నమరువాడలో సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, ప్రతినిధి దాసురాజు అధ్యక్షతన విద్యుత్‌శాఖ అధికారులు శనివారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో కొద్ది రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో ఓల్టేజి, విద్యుత్ సరఫరాలో నిరంతరం అంతరం ఏర్పడడంతో ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ ప్రతినిధి దాసురాజు ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ ఎఇ శివకుమార్ స్పందించారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాబూరావుకు అభినందనలు

ప్రజాశక్తి- పలాస

ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావును ఆయన స్వగృహంలో మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన టిడిపి నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయనకు దుశ్శాలువ కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ల వెంకటరావు, ఆళ్ల కృష్ణారావు, బమ్మిడి ఆనందరావు, ఆర్.సుధాకర్, బెండి రమేష్, వడ్డీ ఢిల్లీ, గరికి కృష్ణారావు, కొవ్వూరు ఢిల్లీ, కొవ్వూరి కృష్ణ, అల్లాడ కృష్ణ, ఆళ్ల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పోలండ్ తెలుగు సంఘం ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : విదేశాల్లో వలస కార్మికునిగా వెళ్లి అనారోగ్యంతో బాధపడుతూ ఇండియాకి వచ్చి చికిత్స పొందుతూ మృతి చెందిన దల్లి గురుమూర్తి కుటుంబానికి పోలండ్ తెలుగు సంఘం ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి మేమున్నామంటూ అండగా నిలబడి ప్రవాసాంధ్రులు, మండలంలోని ఈదుపురానికి చెందిన దల్లి గురుమూర్తి పోలండ్‌లో కూలి పనికి వెళ్లి అనారోగ్యంతో స్వగ్రామానికి వచ్చి ఈ నెల 13న మృతి చెందాడు. స్పందించిన పోలాండ్ జిల్లా తెలుగు సంఘం సభ్యులు వారి కుటుంబానికి రూ.1.10 లక్షలు బాధిత కుటుంబానికి శనివారం ఆర్థికసాయం అందించారు. మృతుడి భార్య మాణిక్యానికి ధైరం చెప్పారు. కార్యక్రమంలో బోర కృష్ణ, జనపాన సతీష్ పాల్గొన్నారు.

జాషువా రచనలు ఆదర్శప్రాయం


చిత్రం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంపై ఎంతో బాధ్యత గల రచనలు అందించిన కవి గుర్రం జాషువా అని, ఆయన ప్రభావం సమాజంపై నేటికీ చిరస్థాయిగా నిలిచిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పి.సురేఖ అన్నారు. శనివారం కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన జాషువా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళ్లర్పించి మాట్లాడుతూ నాటి కవుల్లో తిరుపతి వెంకటకవులతో గుర్రం జాషువా చలోక్తులు నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచి పోయాయన్నారు. పద్మభూషణ్ అవార్డు పొందిన కొద్దిమంది కవుల్లో జాషువా ఒకరని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి పి.నారాయణ రావు, ఎం.వి. సత్య నారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఆర్.హరిత, తెలుగు అధ్యాపకులు పి.వి.రమణ, వివిధ విభాగాది పతులు పాత్రో, జిఎన్‌వి చలమయ్య పాల్గొన్నారు.

నగరంలోని జ్యోతిరావు పూలే పార్కులో దళిత సంఘాల ఆధ్వర్యాన జాషువా జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కళ్లేపల్లి రామ్ గోపాల్, డా కంఠ వేణు, తైక్వాండో శ్రీను పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సింకు రమణ, ఆరిబారిక రాజు, నేతల అప్పారావు, పురుషోత్తం రాంబాబు, అబ్బాస్, పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి : తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గుర్రం జాషువా రచనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఢిల్లేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గుర్రం జాషువా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, తెలుగు శాఖా అధ్యాపకులు లీలా పద్మజ, చరిత్ర అధ్యాపకులు ఓ.కోటేశ్వరరావు, వి.తిరుమలరావు, కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్ పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి జాషువా రచనలపై పాఠకులకు ఆవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయకురాలు అమ్మనమ్మ పాల్గొన్నారు.


స్వర్ణాంధ్ర-2047 అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక వంశధార కళాశాలలో స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికపై అభిప్రాయాలను కళాశాల వ్యవస్థపకులు చింతాడ అనిరుద్రుడు సేకరించారు. విద్య, నైపుణ్యాల అంశంపై ఈనెల 27 నుంచి 29 వరకు కళాశాలలో పలు పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి, ఎఒ కొర్రాయి శ్రీనివాసరావు, కోట సింహాచలం, నంబారి. వెంకటేశ్వరరావు, ఆనందరావు, ధనలక్ష్మి, ధరణి, నగేష్, బెహర రాజేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి స్వర్ణాంధ్ర-2047 విజన్ ప్రణాళికపై అభిప్రాయాలను సేకరించారు. 'ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలోమ స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, సునీత, పద్మజ, శ్రీధర్, రవి, శాంతిమహాపత్రో పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండల పరిధిలో అన్ని గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 సుస్థిర అభివృద్ధితో కూడిన వ్యవస్థకు ప్రజల అభిప్రాయ సేకరణ కోసం డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. గ్రామాల్లో మహిళలకు స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047పై అవగాహన కల్పిస్తూ,


కోటబొమ్మాళి : అవగాహన కల్పిస్తున్న అనిరుద్రుడు

మొబైల్ అప్లికేషన్ ద్వారా ఆర్థిక అభివృద్ధికి కీలక రంగాలపై దృష్టి సారించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్య, వైద్యం, రక్షిత మంచినీరు, సేద్యానికి తగు సాగునీరు అందించడం, ఉపాధి కల్పించడం, ప్రజల జీవన ప్రమాణాల పెంపుదలకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో అందరికీ హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, శానిటేషన్ తదితర రంగాలను మెరుగుపరుస్తూ, అందరికీ సమృద్ధిగా, బలహీన వర్గాలకు అందరితో పాటు అవకాశాలు కల్పించే ఉద్దేశంతో, మహిళా సాధికారిక దిశగా ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సర్వేలో క్లస్టర్ కోఆర్డినేటర్లు, విఒఎలు, గ్రామ సంఘం ప్రతినిధులు, కమ్యూనిటీ ఆడిటర్లు, రైతు ఉత్పత్తిదారు సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : శిబిరాన్ని ప్రారంభిస్తున్న హారికా ప్రసాద్

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజల అవసరాలకు అనుగుణంగా లైన్స్‌క్లబ్ హర్షవల్లి అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి సుధీర్ కుమార్ అన్నారు. శనివారం నగరంలోని రైతుబజారు జంక్షన్‌లో లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కరణం శోభారాణితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన రోగాల బారిన పడుతున్నారన్నారు. వ్యాధి సోకిన తర్వాత వెంటనే ఆస్పత్రులకు వెళ్లకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారన్నారు. ఈ శిబిరంలో 283 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్, క్లబ్ అధ్యక్షులు వావిలపల్లి జగన్నాథనాయుడు, కల్నల్ చంద్రశేఖర్, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, వైద్యులు సత్యస్వరూప్, మురళీకృష్ణ, అనిరుధ్, భాగ్యరాజ్, సీపాన రాజేష్, లావణ్య, మెండ ప్రవీణ్‌తో పాటు లయన్స్‌క్లబ్ సెక్రటరీ మణిశర్మ, తర్లాడ అప్పలనాయుడు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎన్.శ్రీనివాసరావు, ట్రెజరర్లు లక్ష్మీపతి, సుమన్, లక్ష్మణ్, కరణం హారిక, ఉషారాణి పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్యాధికారి ఎన్. రంగారావు 180 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలను సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొట్నూరు జగదీష్, కురమాన దాలయ్య, కాపల నారాయణరావు, బాడాన నారా యణరావు, పోలాకి రుషి, బమ్మిడి ఆనందరావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పోరాడి సాధించిన విశాఖ ఉక్కును ప్రజలంతా ముందుకు వచ్చి పరిరక్షించుకోవాలని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపు నిచ్చారు. శనివారం అంబేద్కర్ ఆడిటోరియం వద్ద అక్టోబర్ 2న విశాఖలో నిర్వహించ నున్న ఉక్కు పరిరక్షణ శాంతి యాత్రపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘ రాష్ట్ర న్యాయ సలహాదారు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, కెవి జగన్నాధరావు, కులావివక్ష నిర్మూలన సంఘం అధ్యక్షులు బెలమర ప్రభాకర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు రాకోటి రాంబాబు, ఎపి సిఎల్‌సి బి.లక్ష్మణరావు, రామారావు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు


నివాళ్లర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ తదితరులు

వైసిపి నాయకులు బాబూరావు మృతి

ప్రజాశక్తి- లావేరు

లావేరు ఎంపిపి ప్రతినిధి, కొత్తకోట మాజీ సర్పంచ్ రొక్కం బాలకృష్ణ సోదరుడు రొక్కం బాబూరావు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చెంద్రశేఖర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, టి.సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

అనర్హుల పింఛన్లు తొలగించాలి

సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.వి.వి.మురళీమోహన్ కుమార్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ టిడిపి నాయకులతో కలిసి నకిలీ పింఛన్లను తొలగించాలని కోరారు. నకిలీ ధ్రువ పత్రాలతో కొంత మంది పింఛన్లు పొందుతున్నారన్నారు. వైసిపి పాలనలో అనర్హులకు పింఛన్లు మంజూరు చేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసారని వాటిని తక్షణమే తొలగించాలని కోరారు. ఇప్పటికే కొన్ని పింఛన్లపై విచారణ జరిపి తొలగింపు చేపట్టి డిఆర్‌డిఎకు పంపడం జరిగిందని ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూన సంజీవరావు, ధనుంజయరావు, అప్పయ్య పాల్గొన్నారు.


తాడివలసలో చేపడుతున్న సిసి రహదారి పనులు

సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి- పొందూరు

మండలం తాడివలసలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో సిసి రహదారుల నిర్మాణ పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ తమ్మినైన మనెమ్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.5లక్షలతో గ్రామదేవత వనంకు వెళ్లే రహదారి, మరో రూ.5 లక్షలతో వెంకంపేట తారురోడ్డు నుంచి శ్మశానవాటికకు వెళ్లేందుకు సిసి రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముమ్మరంగా చేపడుతున్న సిసి రహదారి నిర్మాణ పనులను సర్పంచ్ ప్రతినిధి తమ్మినైన జగన్నాథం నాయుడు, నియోజకవర్గ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు చింతాడ కృష్ణ వాసుదేవరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ నిధులను మంజూరు చేయడంపై కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


పొందూరు : రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

జాతీయస్థాయి పోటీలకు శ్రావణిపాత్రో ఎంపిక

పలాస: జమ్మూ-కాశ్మీరులో ఈ నెల 30 నుంచి వచ్చే 4 వరకు జరుగు 36వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల టెన్నికాయిట్ పోటీలకు పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పొందర శ్రావణి పాత్రో పాల్గొంటుందని జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.వి.జోగారావు, అధ్యక్షులు సంతోష్ కుమార్ మల్లా, పాఠశాల హెచ్ఎం డి.దశరథి, చిట్టిబాబు తెలిపారు. శ్రావణికు వ్యాయామ ఉపాధ్యాయులు పి. తవిటయ్య, శంకరరావు, శ్రీనివాసరావులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..

పొందూరు: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభను కనబర్చిన మండలంలోని లోలుగు కెజిబివి విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రూపవతి తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్-19 విభాగంలో టి.సంతు, ఎస్.కల్పన ఎంపికయ్యారన్నారు. వచ్చే నెల 2న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.